క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో చేరిక


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని మాలెపాడు గ్రామంలో ఆ గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు మేకల వీరభాస్కర్‌రెడ్డి, మరి కొంతమంది శనివారం ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, వెంటసుబ్బారెడ్డి, ఈశ్వరరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రక్త దానం మరొకరికి ప్రాణదానం


రక్తదానం చేస్తున్న ఆర్కే వ్యాలీ ఎస్‌ఐ రంగారావు

చక్రాయపేట : మనం ఇచ్చే రక్తంతో మరొకరి ప్రాణాలను కాపాడవచ్చునని ఆర్కే వ్యాలీ ఎస్‌ఐ రంగారావు తెలిపారు. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శనివారం మారెళ్లమడక గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రక్తం ఇవ్వడం వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదని ఎవ్వరూ అపోహలకు గురి కావద్దన్నారు. అలాగే ఆయనతో పాటి వచ్చిన సిబ్బంది కూడా రక్తదానం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీహరి, ట్రిపుల్‌ఐటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ పీవో డాక్టర్ రమేష్‌బాబు, ప్రసాద్, ఏఎన్ఎం నవనీత, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రిప్ పరికరాలు దహనం


కాలిపోయిన డ్రిప్ పరికరాలు

సింహాద్రిపురం : మండల పరిధిలోని గురిజాల గ్రామంలో శనివారం సాయంత్రం గ్రామానికి చెందిన చరణ్‌కుమార్‌రెడ్డికి చెందిన డ్రిప్ పరికరాలు అగ్నికి ఆహుతయ్యాయి. బాధితుడు తెలిపిన మేరకు.. పొలంలోని అరటి చెట్లను తొలగించి డ్రిప్ పరికరాలను కట్టలు కట్టి పొలం గట్టు మీద ఉంచి ఇంటికి వచ్చాడు. అయితే ఆకతాయిలు పొలం గట్టు మీద ఉన్న డ్రిప్ పరికరాలకు నిప్పు పెట్టడంతో రూ.లక్ష నష్టం వాటిల్లిందన్నారు. ఇటీవల మురళీయాదవ్ అ నే రైతు పొలంలో ఉన్న మోటార్, కేబుల్‌వై రు, డ్రిప్ పరికరాలు కూడా కాలిపోయాయని.. సుమారు రూ.70 వేలు నష్టం వాటిల్లిందని తెలిపారు. ఇది గిట్టని వారు చేస్తున్నారా లేక ఆకతా యిలు చేస్తున్నారా అని రైతులు వాపోతున్నారు.

పెరటి తోటలతో మంచి లాభాలు


పెరటి తోటను పరిశీలిస్తున్న పీఆర్పీ శ్రీనివాసులు, తదితరులు

సింహాద్రిపురం : ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఇళ్ల వద్ద పెరటి తోటలు ఏర్పాటు చేస్తే మంచి లాభాలు గడించవచ్చునని మండల పీఆర్పీ శ్రీనివాసులు తెలిపారు. శనివారం మండల పరిధిలోని బలపనూరుకు చెందిన భవానికి 5 సెంట్ల విస్తీరణంలో సూర్య మండల నమూనా ఏర్పాటు చేసి 18 రకాల కూరగాయల విత్తనాలను పెరటి తోటలో చల్లడం జరిగింది. ఈ పెరటి తోటను ప్రాజెక్టు రీసోర్స్ పర్సన్ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ పెరటి తోటలో కాకర, బీన్స్, క్యారెట్, బీర, సార, కీరా, మునగ, బెండ, టమోట, మొటిక, ముల్లంగి, గోంగూర, కొత్తిమీర, తదితర కూరగాయల విత్తనాలు వేయడం జరిగిందన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కడప అర్బన్: కడప రాజారెడ్డి వీధిలోని ఎస్పీ బంగళా సమీపంలో శనివారం సాయంత్రం రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలనీ వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలను నడపవద్దన్నారు. డ్రైవింగ్‌లో సెల్‌ఫోన్ మాట్లాడటం ప్రమాదకరమనీ ఎస్‌ఐ హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి


పట్టభద్రుడిని ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. శుక్రవారం పట్టణంలోని మెయిన్ బజార్‌లోని పట్టభద్రుల ఇళ్లకు మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డిలతో కలిసి ఆయన పట్టభద్రుల ఓట్లను అభ్యర్థించి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్ కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లె కిశోర్, లక్ష్మీప్రసన్న, జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి, ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, కో ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు రసూల్, సోపాల వీరా, పద్మనాభరెడ్డి, సంపత్, నాగరాజు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె : ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం శనివారంతో ముగిసింది. శనివారం మండలంలోని గోనుమాకులపల్లె, తంగెడుపల్లె, ఓబుల్‌రెడ్డిపల్లె, తలపనూరు, ఉరుటూరు, గంగిరెడ్డిపల్లె, మర్రిపల్లె, ఎన్.పాలగిరి, వెంకటాపురం, కొమ్మద్ది, అడవిచెర్లోపల్లె గ్రామాల్లో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల కన్వీనర్ రఘునాథరెడ్డి ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న అభ్యర్థులను మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు విజయానందరెడ్డి, స్థానిక నాయకులు సంపత్‌కుమార్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, వీరభద్రారెడ్డి, వీరయ్యయాదవ్, గోవిందురెడ్డి, సురేంద్ర కుమార్, శ్రీనివాసుల్‌రెడ్డి, గంగయ్య యాదవ్, నాగిరెడ్డి, సాంబశివారెడ్డి, ప్రతాప్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం


పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

జమ్మలమడుగు : పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి శనివారంతో తెరపడింది. సోమవారం ఎమ్మెల్సీల ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ ఉండటంతో రెవెన్యూ, పోలీసు అధికారులు పోలింగ్ నిర్వహించే కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించారు. శనివారం ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ తిరుపతయ్య, సీఐ సదాశివయ్యలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనేదానిపై రెవెన్యూ అధికారులకు సూచించారు. ఆదివారం మధ్యాహ్నం నాటికి పోలింగ్ కేంద్రాలను సిద్ధంగా చేసి ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా మౌలిక ఏర్పాట్లు చేయాలన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహిస్తాం-ఆర్డీఓ జి.శ్రీనివాసులు

జమ్మలమడుగు సబ్ డివిజన్ పరిధిలోని పది మండలాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేటందుకు అన్ని చర్యలు తీసుకున్నామని ఆర్డీఓ జి.శ్రీనివాసులు తెలిపారు.

సబ్‌డివిజన్ పరిధిలో మొత్తం 40 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందులో 30 పట్టభద్రులకు మరో 10 ఉపాధ్యాయ ఎమ్మెల్సీలకు కేటాయించారు. అత్యధికంగా ప్రొద్దుటూరులో పట్టభద్రులకు 15 కేంద్రాలను, జమ్మలమడుగులో నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఓటర్లు ప్రభుత్వం సూచించిన మేరకు గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి పోలింగ్ కేంద్రంలో చూపించి ఓటింగ్‌లో పాల్గొన వచ్చు అన్నారు.

మండలం	పోలింగ్ కేంద్రాలు (పట్టభద్రుల-ఉపాధ్యాయ)	మొత్తం
జమ్మలమడుగు	4+1	05
మైలవరం	1+1	02
పెద్దముడియం	1+1	02
ముద్దనూరు	1+1	02
కొండాపురం	2+1	03
ఎర్రగుంట్ల	3+1	04
ప్రొద్దుటూరు	15+1	16
రాజుపాళెం	1+1	02
చాపాడు	1+1	02
దువ్వూరు	1+1	02
మొత్తం	30+10	40

నష్టపరిహారంలో జాప్యం తగదు


ఆలయం వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

వేంపల్లె : పట్టణంలోని రోడ్డు విస్తరణలో భాగంగా శ్రీవృషభాచలేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించిన వాణిజ్య సముదాయాల గదులు కోల్పోయాయని.. అందుకు నష్టపరిహారం చెల్లించకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాలి హరిప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక వృషభచాలేశ్వరస్వామి దేవస్థానం(ఎద్దులకొండ) వద్ద బీజేపీ నాయకులు నోటికి నల్ల గుడ్డలు కట్టుకుని నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. ఏటా దేవస్థానం వారు గ్రామ పంచాయతీ ద్వారా ప్రభుత్వానికి రూ.12 లక్షలు చెల్లిస్తున్నారని.. మరీ మసీదు కమిటీ వారు కేవలం రూ.3 లక్షలు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. అయితే నష్టపరిహార విషయంలో మసీదు కమిటీకి రూ.3.70కోట్లు, శ్రీవృషభాచలేశ్వరస్వామి దేవస్థానానికి రూ.1.50 కోట్లు మంజూరు చేశారన్నారు. నష్టపరిహారం విషయంలో మసీదు, దేవాలయాలకు చాలా వ్యత్యాసం ఉందని.. అంతేకాక కోల్పోయిన దేవస్థాన గదుల నష్టపరిహారంలో జాప్యం చేస్తున్నారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సునీల్‌ఉమార్, ప్రవీణ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. ప్రసన్న విఘ్నేశ్వర కల్యాణం


స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

కడప కల్చరల్ : కడప నగరం బెల్లమండివీధిలోని శ్రీ ప్రసన్న విఘ్నేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీ సిద్ధి బుద్ధి అమ్మవార్ల సమేతంగా తిరు కల్యాణ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ త్రి పుష్కర సహిత అష్టబంధన మహా కుంబాభిషేకం సందర్భంగా ఈనెల 8 నుంచి కార్యక్రమాలు జరుగుతున్నాయి.

తొలుత మూలవర్లకు అభిషేకం జరిపారు. ప్రాతఃకాల పూజ, హోమం, మహాపూర్ణాహుతి, కలశోద్వాసన, అష్టబంధన సమర్పణ, మహాకుంభాభిషేకం, ప్రథమ దర్శన ఘట్టం నిర్వహించారు. అనంతరం వధూవరులుగా అలంకరించిన ఉత్సవమూర్తులను కల్యాణ వేదికపై ఏర్పాటు చేసి అర్చకులు చంద్రమౌళిశర్మ బృందం కల్యాణ క్రతువును నిర్వహించిది. రాత్రి పల్లకిపై వధూవరులైన దేవతామూర్తులను కొలువుదీర్చి అట్టహాసంగా నగరోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులందరికీ అన్నదానం ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం ఉత్సవాల ముగింపు సందర్భంగా పుష్పయాగం నిర్వహిస్తారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

పులివెందుల రూరల్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించి నేటితో 12 ఏళ్లు పూర్తి చేసుకుని 13వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా పట్టణంలోని భాకరాపురంలో ఉన్న వైఎస్సార్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ వర్గాలు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 12 ఏళ్ల కాలంలో అనేక కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలను పొంది పార్టీ అధికారంలోకి రావడం జరిగిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందుతోందన్నారు. పార్టీ ఆవిర్భావ కార్యక్రమానికి మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి హాజరవుతారని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొని ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

యువగళం కాదు.. అసత్య గళం

సీకేదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీకేదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి

కడప కార్పొరేషన్ : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పేరుతో చేపట్టిన పాదయాత్ర లో అన్ని అసత్యాలే మాట్లాడుతున్నారని సీకేదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి ధ్వజమెత్తారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ లోకేష్ ప్రధానంగా పరిశ్రమలు, మహిళలు, ముస్లింల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఏమీ చేయడంలేదని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి లక్షా నలభై వేలమందికి ఉద్యోగాలు ఇచ్చారన్నారు. అలాగే 411 ఎస్‌ఐ పోస్టులు, తదితర పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. వైద్య శాఖలో 48 వేల మందికి ఉద్యోగాలు, స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. ఇలా సుమారు 3 లక్షల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. బాబు వస్తే జాబు వస్తుందనే నినాదంతో 2014 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన టీడీపీ కేవలం 34 వేల మందికే ఉద్యోగాలు ఇచ్చారన్నారు. విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో 375 మందితో రూ.13 లక్షల కోట్ల ఎంఓయూలను కుదుర్చు కున్నారని తెలిపారు. రిలయన్స్ అంబానీ తదితర బడా పారిశ్రామిక వేత్తలు ఆంధ్ర రాష్ట్రంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ప్రొటెన్షియల్ ఉందని కొనియాడారన్నారు. సమ్మిట్ కారణంగా పరిశ్రమలు వస్తే 13 లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు ఐస్ క్రీం రవి, సుబ్బరాయుడు, క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రముఖ గుండె జబ్బు నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ దినేష్‌కుమార్‌రెడ్డి కిడ్నీలో రాళ్లు, కిడ్నీ వాపు, కిడ్నీ అండ్ యూరిన్ ఇన్ఫెక్షన్, మూత్ర సమస్యలు, ప్రోస్టేట్ గ్రంథి సమస్యలు తదితర జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ వైద్యులు డాక్టర్ డి.వి.నారాయణరెడ్డి ఆసుపత్రిలో 24గంటలు అందుబాటులో ఉండి ఎండోస్కోపీ, కోలోనోస్కోపీ, అన్ని జీర్ణకోశ, లివర్, ఫ్యాంక్రియాస్ క్యాన్సర్‌లకు ఆపరేషన్లు చేస్తారన్నారు. ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. షుగర్ పరీక్షలు చేయించాలనుకునేవారు పరగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9963170177, 08568286189 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ స్థాపన


ధ్వజస్తంభాన్ని నిలబెడుతున్న నిర్వాహకులు

వేంపల్లె : స్థానిక కడప-పులివెందుల బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి ఆ లయంలో శనివారం ధ్వజస్తంభ స్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి అధ్యక్షతన అర్చకులు ఎస్.ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ధ్వజస్తంభాన్ని నిలబెట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. నేడు ఆదివారం అయ్యప్ప స్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

అనాథ వృద్ధులకు అన్నదానం


అనాథలకు భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

వేంపల్లె : స్థానిక పాత గండి రోడ్డులోని మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ఆశ్రమంలో అనాథ వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శనివారం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక కార్యదర్శి దుద్దేకుంట రవిశేఖర్ తల్లి లక్ష్మీదేవమ్మ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. అనంతరం వృద్ధులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు విజయమోహన్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థులకు..

కమలాపురం : పట్టణంలోని ఎయిమ్ ఫర్ సేవ (అనాథ బాలుర ఛాత్రాలయం) విద్యార్థులకు సి.గోపులాపురంకు చెందిన పుల్లగూర రామకృష్ణ, సుబ్బలక్ష్మి కుటుంబ సభ్యులు శనివారం విద్యార్థులకు అన్నదానం చేశారు.

ఘనంగా కడప రాయుడి గ్రామోత్సవం



కడప కల్చరల్ : తిరుమలకు తొలిగడపగా భావిస్తున్న దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి గ్రామోత్సవాన్ని శని వారం ఘనంగా నిర్వహించారు. ఆలయ మాసోత్సవాల్లో భాగంగా రెండో శనివారాన్ని పురస్కరించుకుని తొలుత మూలమూర్తికి, అ నంతరం ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను పలు రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పల్లకీపై కొలువుదీర్చారు. భక్తుల జయజయధ్వానాల మధ్య పల్లకీ దేవునికడప మాడవీధుల్లో సాగింది. గ్రామస్తులు తమ వీధికి తరలివచ్చిన స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు వారికి హా రతులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అర్చకులు త్రివిక్రమ్ ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇతర కార్యక్రమాలు నిర్వహించారు.

శబరిమల ఆలయాన్ని తలపించేలా!

కడప కల్చరల్ : కడప నగరంలో స్వామి అయ్యప్పకు నూతన ఆలయం ఏర్పాటు చేసేందుకు పనులు ప్రారంభమయ్యాయి. కడప నగరంలో స్వామి అయ్యప్పకు తొలిసారిగా మున్సిపల్ మైదానంలో ఆలయం నిర్మించారు. ఇదే స్థానంలో శబరిగిరిలోని అయ్యప్ప ఆలయాన్ని తలపించేలా అదే నిర్మాణశైలిలో నూతన ఆలయాన్ని నిర్మించేందుకు పనులు ప్రారంభం అయ్యాయి.

1997లో కేరళ నుంచి ఈ ప్రాంతానికి వచ్చిన అయ్యప్పస్వామి భక్తులు పీకే విశ్వనాథ గురుస్వామి కోరిక మేరకు స్థానిక ప్రముఖులు మున్సిపల్ మైదానంలో ఈ ఆలయాన్ని ఏర్పాటు చేశారు. తొలుత కొద్దిమంది భక్తులు వచ్చేవారు. క్రమంగా భక్తులు, దాతల సహకారంతో ఆలయం అభివృద్ధి చెందింది. దాదాపు పాతికేళ్లు కావడం, ఆధునిక వసతులు అవసరం కావడంతో కొందరు భక్తులు నూతన ఆలయ నిర్మాణం గురించి ప్రతిపాదన తెచ్చారు. ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్షుడిగా మేడా వెంకట శేషారెడ్డి, ఉపాధ్యక్షులుగా పోతుల వెంకట్రామిరెడ్డిలతో సభ్యులుగా శంకరయ్య, బాలకృష్ణ, భాస్కర్‌రెడ్డి, రాణా ప్రతాప్, రంగరాజు, కరుణాకర్‌రెడ్డి తదితరులతో నిర్మాణ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు.

పనులు ప్రారంభం

2019లోనే నూతన ఆలయ నిర్మాణానికి ప్రయత్నాలు జరిగాయి. ఇంతలో కరోనా రావడం, పలు మార్పులు చోటుచేసుకోవడంతో మళ్లీ నూతన ఆలయ నిర్మాణం గురించి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. అంచనా వ్యయం కూడా మారింది. ప్రస్తుతం శబరిమలలోని అయ్యప్ప ఆలయాన్ని పోలినట్లు సన్నిధాన దేవతల ఆలయాలను కూడా అదే ప్రాంగణంలో నిర్మించేందుకు మొత్తం రూ. 5 కోట్లకు పైగా అవసరమవుతుందని అంచనా వేశారు. తొలుత నిర్మాణ కమిటీ సభ్యులు తమవంతు విరాళం ప్రకటించారు. అనంతరం నగరంలోని అయ్యప్ప భక్తులు కూడా ఈ కార్యక్రమానికి సహకారం అందించగలమని హామీ ఇచ్చారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వేముల : మండల పరిధి 33/11 కె.వి. పరిధిలోని రాచకుంటపల్లె, మబ్బుచింతలపల్లె, పెర్నపాడు, పెద్దజూటూరు, వేముల విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8.15 గంటల నుంచి రూ.11.15 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ శాఖ ఏఈ రమేష్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు.